న్యాయం

-ఆంధ్రప్రభ, 26-7-1977

"న్యాయమైన ఏ కొత్త చట్టమైనా ఆచరణీయం.
కానీ.... కులమతాలకు మాత్రమే దానిని వర్తించనీకుండా
వ్యక్తి సంపూర్ణ ఆర్థిక పరిస్థితులను తూచి చూసి....
దాన్ని అమలులోకి తెస్తే.... అది.... హర్షణీయం."

"మీరా!"

"నువ్వు.... నువ్వు...."

స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని నా గదిలోకి అడుగుపెట్టినవాళ్ళు... వాళ్ళను ఆ స్థితిలో అక్కడ చూచిన నేను కూడా బిత్తరపోయాము.

* * * * *

"అబ్బ, ఆ బొమ్మ ఎంత బాగుంది గోమతీ!"

"అది మా నాన్నారు ఢిల్లీ నుండి తెచ్చారు, నీకు కావాలా, చంద్రా."

మొదటి మాటలోని గర్వం, కొసకు ఆ 'బొమ్మని ఇవ్వాల్సి వస్తుందేమో' అనే దిగులుగా మారింది.

"వద్దులే గోమతీ, ఆ బొమ్మ ఈ అద్దాల బీరువాలోనే బాగుంటుంది." స్నేహితుని నిరాకరణ గోమతికెంతో ఆనందాన్నిచ్చింది. చంద్రశేఖర్ కావాలని అడిగి ఉంటే 'ఇవ్వను' అనలేని ఆరాధన వుంది ఆ పిల్లాడిమీద ఆ పిల్లకు.

"ఈ కార్పెట్ ఎంత బాగుందో!"

ఈసారి గోమతి హృదయపూర్వకంగానే అంది.

"నాన్నగారి నడిగి ఇది నీ కిచ్చేస్తాలే చంద్రా."

"అమ్మో, వద్దు. మీ డాడీ కొడతాడు."

ఈ మారు ఆ పిల్ల కళ్ళనిండా ఆశాభంగం. 'ఇది బొమ్మకాదు. కాళ్ళక్రింద వుండే కార్పెట్ అది... లేకపోతేనేం? చంద్ర అంత ఇష్టపడుతున్నాడు. నాన్నగారు ఇచ్చేస్తేనేం?"

ఇంతలోనే ఆ చిన్న మెదడులో మెరుపులా ఆలోచన తట్టినట్లుంది. ఛెంగున గెంతి చంద్రం చెయ్యి పట్టుకుని లాగుతూ అంది.

"పోనీ, రా, చంద్రా, డాక్టర్‌గారిని అడిగి కొనుక్కుందువుగాని."

గుండ్రటి కళ్ళను మరింత గుండ్రంగా చేసుకుని చూసాడు చంద్ర.

"భలేదానివే. మా నాన్నగారి దగ్గర డబ్బెక్కడిదీ?"

"డబ్బు లేకేం. డాక్టర్లంటే గొప్పోళ్ళేగా..."

"ఎవరు చెప్పారు నీకు?"

"నీ సెక్షన్‌లో బి. విజయ లేదూ. ఆ పిల్ల చెప్పింది. వాళ్ళ మామ డాక్టరట. ఎప్పుడూ విమానాల్లోనే తిరుగుతాడట."

పన్నెండేళ్ళ చంద్రశేఖర్ ఆలోచనల్లో పడిపోయాడు.

'డాక్టర్లంటే గొప్పోళ్ళా! మరి మా నాన్నగారి దగ్గర ఎప్పుడూ డబ్బెందుకుండదూ? అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ నాన్నని డబ్బు అడుగుతుందేం?'

"ఈ నేల ఇంత నున్నగా జారిపోయేలా ఎలా ఉంటుందో!"

"ఏమో, నాకు తెలీదు." ఎనిమిదేళ్ళ గోమతి కళ్ళనిండా అమాయకత్వం. ఆ అమాయకత్వమంటే చంద్రశేఖరానికి చాలా ఇష్టం.

"మీ అమ్మగారు ఎప్పుడూ పడుకునే వుంటారేం? పనేమీ చేయదా?"

"ఏమో నాకు తెలియదు" అంటుందనుకున్న గోమతి ఆ పిల్లవాడిని నిరాశ పర్చింది.

"అమ్మెందుకు చేయాలి?"

"అరే, మరి మా అమ్మ ఎప్పుడూ పని చేస్తూనే వుంటుందే...."

"మీకు నౌకర్లు లేరా, పాపం!" జాలిగా అడుగుతున్న గోమతిని ప్రియంగా చూస్తూ చప్పున ముద్దు పెట్టుకున్నాడు చంద్రశేఖర్?

"ఛీ..." పారిపోయింది గోమతి.

* * * * *

కమిలిపోయిన వాళ్ళ ముఖాలింకా అలాగే ఉండగానే క్షణకాలపు నా జ్ఞాపకాల తెరనుండి నేను తేరుకున్నాను.

"కూర్చోండి. కూర్చో, గోమతీ!"

వాళ్ళు కూర్చోలేదు. నా విశాలమైన గది వాళ్ళకు ఎంతో యిరుగ్గా, ఊపిరాడ నన్నట్టుగా వున్న వాళ్ళ కదలికల్లోని అసహనమే తెలుపుతోంది.

"రండి లోపలికెళ్దాం. అమ్మ మిమ్మల్ని చూస్తే చాలా సంతోషిస్తుంది."

గోమతిలో కదలిక కలిగింది.

"డాక్టర్.... మేము...." గోమతి అమ్మగారు మధ్యలో కల్పించుకుంది.

"వస్తాం, బాబూ!"

మా ఈ చిన్ని సంభాషణలో నేను వాళ్ళ ఈ స్థితికి కారణాన్ని వెతుకుతున్నాను. వాళ్ళ ముఖాల్లో మారుతున్న భావాల్ని కనిపెడుతూనే వున్నాను. నర్స్ వచ్చి 'నర్స్ పని కావాలని ఒక అమ్మాయి బయట మీ పిలుపుకోసం ఎదురుచూస్తోంది' అని చెప్పినప్పుడు ఆ అమ్మాయి స్థానంలో గోమతి వుంటుందనేది నా ఊహకందని విషయమే అయినా, నేను తొందరలోనే తేరుకున్నాను. కానీ, నర్సు పనికొరకు దేవిరిస్తూ వచ్చింది నా దగ్గరకేనని తెలిసినవాళ్ళిద్దరూ ఇంకా ఆ షాక్‌నుండి తేరుకోలేదు. పాలిపోయిన గోమతి ముఖం వంక చూస్తున్న నాకు గతం గుర్తుకు రావడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు.

మా నాన్నగారు డాక్టరు కానీ, సంపాదన పెద్దదేమీ కాదు. వెనుక ఆస్తులేమీ లేవు. దానితో మేము మధ్యతరగతిలోనే మిగిలిపోయాము. మా నాన్నగారికున్న కొద్ది మంది పేషెంట్లలో కృష్ణారెడ్డి ఒకరు. ఆయనకు ఎప్పుడూ ఏదో ఒక నలత వుంటూనే వుండేది. ఆయనను చూడడానికి నాన్నగారు వెళుతున్నప్పుడల్లా నేను కూడా వెంట వెళ్ళేవాడిని. అలా నా బాల్యంనుండి వాళ్ళ హోదా, సిరి నన్ను అమితంగా ఆకర్షిస్తూ వుండేవి. నిగనిగలాడే నేల, అద్దాల బీరువాలు... అందులో బొమ్మలు, విశాలమైన మెట్లు.... గాలికి అటుఇటు ఎగిరే పలచటి పరదాలు.... అవి నన్ను కొన్ని సంవత్సరాల

ముందుకు నడిపి నా భవిష్యత్తును ఊహాపథంలో నిలబెట్టేవి. అలా అయిదు సంవత్స రాలు గడిచిపోయాయి. నేను మెడిసిన్‌లో జాయిన్ అయ్యాను. హాస్టలు కెళ్ళిపోయాను. అప్పటికి ఆ ఐశ్వర్యంమీద ఆశ్చర్యం, ఆకర్షణ తగ్గి, నాకు అలాంటి ఐశ్వర్యం కావాలనే కోరిక మిగిలిన రోజులవి. ఆ తర్వాత కృష్ణారెడ్డికి స్వంత మేడ తనకు అచ్చిరాక అనా రోగ్యంగా వుందని నమ్మి, అది అమ్మేసి పొలాలు కొన్నారని... ప్రస్తుతం నెలకు రెండు వేల రూపాయల అద్దె ఇంట్లో వుంటున్నారని విన్నాను. ఆ తర్వాత నాన్నగారు వేరే ఊరికి మకాం మార్చి అక్కడ ప్రాక్టీస్ పెట్టడం, అక్కడ బాగా ప్రాక్టీస్ రావడం జరిగింది. ఆనాడు ఒంటినిండా నగలతో, పాడిపంటల మధ్య లక్ష్మీదేవిలా వుండే కృష్ణారెడ్డి భార్యను, ఆమె గారాలపట్టి, ఆనాటి నా స్నేహితురాలు, నా జ్ఞాపకాల తెరల మధ్య ఇంకా మిగిలిన గోమతిని ఈ స్థితిలో ఈనాడు చూడడం నాకు సంతృప్తికరమైన విషయమేమీ కాదు.

ఆనాటి సంఘటన ఒకటి ఇప్పటికీ తనకు గుర్తుంది. 'నేను డాక్టరు కోర్సు చదవబోతున్నాను, గోమతీ!' అన్నప్పుడు చేదుగా ముఖం పెట్టింది పదమూడేళ్ళ గోమతి. "ఛీ వద్దు చంద్రా. నువ్వు చక్కగా మా నాన్నలా సేద్యం చేసుకో, డాక్టర్‌కు డబ్బే వుండదు."

ఆ తర్వాత రెండుమూడుసార్లు వాళ్ళింటికెళ్ళాడు తను. నాన్నగారు లేకుండా... ఏ ఆకర్షణవల్ల ఆ ఇంటికెళ్ళాడో ఆనాడు బోధపడకపోతే బోధపడకపోవచ్చు. ఆ తర్వాత వాళ్ళ అడ్రసు తెలియక అల్లాడుతున్న రోజుల్లో ఆ ఆకర్షణ తాలూకు స్పష్టమైన స్వరూపం బోధపడింది. ఆ రోజు ఇల్లు వెతుక్కుంటూ వెళితే గోమతి ఒక్కక్షణం మటుకే తనకు కనిపించింది. ప్రకృతి ఇచ్చిన మార్పుతో క్రొత్త సొగసులు దిద్దుకున్న గోమతి మరుక్షణంలో మాయమైంది. కానీ, ఆ ఆకర్షణ ఇంకా తనలో సజీవంగానే నిలిచిపోయింది.

"వెళ్ళొస్తాం బాబూ?"

గతంనుండి తేరుకుని కాస్త బలవంతంగానే వాళ్ళిద్దరినీ ఇంటికి తీసుకెళ్ళి అమ్మకు చూపించాను. ఆమె వాళ్ళ ఆకారాలు వెంటనే గుర్తించలేకపోయింది. కానీ, వాళ్ళ జ్ఞాపకాలింకా ఆమెనుండి జారిపోలేదులా వుంది. ఆప్యాయంగా పలకరించి కూర్చో బెట్టింది. సింధూర హీనమైన ఆమె ముఖంవంక చూస్తూ ఆమె భర్తని గురించి అడగలేక పోయింది. కానీ, మిగతావాళ్ళను పేరు పేరునా క్షేమం అడిగింది. అన్నిటికీ నిర్లిప్తంగా, అసహనంగా తల వూపుతున్న ఆమెను నేను గమనిస్తూనే వున్నాను. ఆనాటి గోమతి నన్ను మరచిపోయిందో లేక తన స్థితిని తలచుకొని కించపడిందో నిశ్శబ్దంగా సోఫాలో ఒదిగి కూర్చుంది. ఒక్కసారైనా కళ్ళెత్తి నా వైపు చూస్తుందేమోనని ఆశగా ఎదురు చూసిన నాకు ఆశాభంగమే అయింది. మా అమ్మ వాగ్ధాటి, ఆమె మౌనం అలా కొనసాగుతూనే

వున్నాయి. నాకా పరిసరాలు అంత సౌకర్యంగా అనిపించక నా గదిలోకొచ్చేసాను. తీరా అయిదు నిమిషాలన్నా కాలేదు. గోమతికి దూరంగా వుండాలనిపించలేదు.

అంత ఎత్తులో నిలబడి జాలిగా చూస్తూ తన విశాలమైన కళ్ళలో తన ప్రేమనంతా వ్యక్తంచేసే చిన్ననాటి గోమతి... జాలి గొలిపేలా అలా సోఫాలో ఒదిగి కూర్చున్న దృశ్యం నన్ను వదలిపోవడం లేదు.

ఎందుకు? ఎందుకిలా జరిగింది?

'అయ్యో, చంద్రా! నీకు క్రొత్తబట్టలు లేవూ? నేనిస్తాలే, వేసుకుందువు గాని...' అని నా కన్నీళ్ళు తుడిచిన ఆ లేతపిల్లకు తనేమీ చేయలేదా?

ఆలోచిస్తూ వంటింట్లోకి వెళ్ళాను. వంటామెచేత నాలుగు గ్లాసులు గ్రేప్ జ్యూస్ తయారుచేయించి, అవి తీసుకొని హాల్లోకి వచ్చాను.

నేను వచ్చేసరికి ఈ మారు గోమతి అమ్మ మాట్లాడుతోంది. ఇక దాచుకోలేక ఆమె మొదలెట్టిందో లేక మా అమ్మ ఓపికే ఆమెచేత తన స్వీయకథనం చెప్పించేలా చేసిందో నాకు తెలియదుగాని, వాళ్ళ మాటల్లో తాను నమ్ముకున్న పొలాలు పోగొట్టుకుని పేదవారయ్యారనే షాక్‌తో కృష్ణారెడ్డి పోయారనే సంగతి మాత్రం తెలుస్తోంది.

"నేను అనేదాన్ని.... ఇద్దరాడపిల్లలు వున్నారు. ఇద్దరి పేరున వాళ్ల పెళ్ళికి కొంత డబ్బు బాంకులో వేయమని... ఆయన వినేవారు కాదు."

"డబ్బుని అలా ఇనప్పెట్టెలో దాచకూడదు లక్ష్మీ, ఆ డబ్బునే పొలాలమీద పెడితే ధాన్యలక్ష్మి మనింటికొస్తుంది. ఎందరి కడుపులో నింపుతుంది అది" అని అనేవారు. ఆమె చెంపలమీదుగా పాత స్మృతులతో కన్నీళ్ళు జారిపోతున్నాయి.

నిజమే. ఆయనలో అంత ఆస్తి వున్నా అహంకారం వుండేదికాదు. నలుగురికీ సహాయపడే తత్త్వం ఆయనది. డబ్బులేని వాళ్ళను కించపరిచేవాళ్ళు కూడా కాదు. నాన్నగారు ఆయనను చూడడానికి వెళ్ళేటప్పుడు ఎంత జబ్బుతో వున్నా లేవడానికి ప్రయత్నించేవారు. ఆ ఇంటిలో ఆడవాళ్ళు కూడా నాన్నగారు వెళ్ళగానే మర్యాదగా ఒక ప్రక్క ఒదిగి నిశ్శబ్దంగా ఉండేవాళ్ళేగాని, మిగతా సిరిగల ఇళ్ళలోలాగ దర్పం ప్రదర్శించేవాళ్ళు కాదు.

"ఆనాడు ఆయన నేను చెప్పిన మాట వినుంటే ఈనాడు ఈ పిల్లలు ఇంత అనాథలై వుండేవాళ్ళు కాదు."

"అమ్మా!" వారిస్తున్నట్టు అంది గోమతి.

"చెప్పనీ తల్లీ. చెప్పకపోతే నా గుండె పగిలిపోయేలా వుంది. ఇంత విషాదాన్ని

గుండెల్లో దాచుకుని ఇంకా గంభీరంగా వుండడం నాచేతనయ్యే పనేనా.... చెప్పమ్మా!"

చేతిలో గ్రేప్ జ్యూస్ అందించే నిమిత్తం గోమతి ప్రక్కగా నిలబడ్డాను. ఆమె తన విశాలమైన కళ్ళెత్తి నావైపు చూసింది. ఆ కళ్ళలో సన్నటి నీటిపొర.

ఉలిక్కిపడ్డాను.

"మీ మరిదివాళ్ళు......" సగంలోనే ఆగిపోయింది అమ్మ.

"వాళ్ళకేమమ్మా తెలివిగలవాళ్ళు.... నాలుగురకాల ఆస్తులుచేసి పెట్టుకున్నారు. మద్రాసులో హోటలుంది. నెల్లూరులో సినిమా హాలుంది. బాంకులో డబ్బుంది. ఈయన లాగ పొలాలను నమ్ముకున్నారా?" ఆఖరి మాటంటున్నప్పుడు భర్త యెడల సానుభూతి తోనో, లేక తమ ప్రస్తుత దీనస్థితిలోనో ఆమె కంఠం ఆర్ద్రమయింది.

"బాధపడకు లక్ష్మీదేవమ్మా. ఆయనమట్టుకు అలా జరుగుతుందని కలగన్నారా?"

నాకంతా అయోమయంగా వుంది. ఏదో నష్టంలో మొత్తం ఆస్తిని పోగొట్టుకునేంత చిన్న ఆస్తికాదు వాళ్ళది.

పన్నెండేళ్ళనాటి ఒక రోజు నాకింకా గుర్తుంది. గోమతి వాళ్ళ నాన్నగారితో పాటు సరదాపడి గోమతి, నేను వాళ్ళ పొలాలు చూడ్డానికెళ్ళాము. కొబ్బరినీళ్ళు తాగుతూ ఏపుగా ఎదిగిన వరితో ఆడుకుంటూ, మొక్కజొన్న కంకులు తెంపుతూ పొలాలకడ్డంగా వెళుతూనే వున్నాము. రెండు మూడు పల్లెటూళ్ళు దాటాక ఆ చల్లటి సాయం సంధ్యలో కూడా అలసి కూర్చుండిపోయాను. 'ఇంకా ఎంత దూరం?'

గలగలా నవ్వింది గోమతి.

'అప్పుడే! ఇంకా సగమైనా రాలేదు మనం.'

* * * * *

నా కంటి కొసలనుండి గోమతి అమ్మ నిలుచున్న కూతుర్ని చెయ్యిపట్టుకుని లాగి కూర్చోపెట్టుకోవడం కనిపించి ఇటు తిరిగాను.

"ఈ పిల్లమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారాయన! మన గోమతి ఏ ఇంట కాలు పెడితే ఆ ఇంట లక్ష్మి వెలుస్తుంది అనేవారు. ఈ రోజు మా గోమతిని చేసుకుంటామని ఎవ్వరూ ముందుకు రావడంలేదమ్మా" ఆమె వెక్కి వెక్కి ఏడ్వసాగింది. ఏడుస్తూ ఏడుస్తూనే గోమతిని చప్పున గుండెల కదుముకుంది.

"ఇప్పుడీ పిల్లను ఏం చేసేది? నర్సుగా బ్రతుకులానంటుంది. నా కడపులో చిచ్చుపెట్టి...." ఇక మరి మాట్లాడలేనట్టు పళ్ళతో పెదాలు కరచుకుంది. అంత బిగ

బట్టినా ఆ పెదాలు అదురుతూనే వున్నాయి. గోమతి మాత్రం రాయిలా తల్లి కౌగిలిలో అలాగే వుండిపోయింది. వాళ్ళప్రక్కన వుంచిన గ్లాసుల్లోని ద్రవం నిశ్చలంగా వుంది.

'షోకేస్' లోని బొమ్మలు సర్దుతున్నట్టు నటిస్తూ వాళ్ళ మాటలు వింటూ అంతా గమనిస్తున్న నేను అంతటి విషాదాన్ని భరించలేకపోయాను. ఆమెను ఆ బాధనుండి తప్పించడానికి నేను టాపిక్ మార్చే ఉద్దేశంతో ఇటు తిరిగాను.

"విజయ ఏం చదువుతోందిప్పుడు?" అని అడిగిన నా ప్రశ్న కూడా ఆమెను అమితంగా బాధించినట్లుంది.

"ఇంకా ఏం చదువులు, నాయనా! అందరి చదువులూ ఆయనతోనే ఆగి పోయాయి. ఆ పిల్లకూ వస్తున్నాయి పదహారేళ్ళు...."

మరి ఆమెను ఓదార్చే భాష నా దగ్గరలేదు. ఈ విషయంలో మగవాళ్ళకంటే ఆడవాళ్ళ గుండె పెద్దదేమో! అమ్మ మళ్ళా అడిగింది!

"ఇంట్లో ఫర్నీచర్ అదీ......"

"కోర్టులచుట్టూ తిరగడానికి అయిపోయింది" నిర్లిప్తంగా అంది ఆమె.

"మరి మీకు చాలామంది అప్పులుండేవాళ్ళుకదా, లక్ష్మీదేవమ్మా!" చెడిపోయిన వాళ్ళ కథలు తెలుసుకోవాలనే కుతూహలం అమ్మ కళ్ళలోనూ వుంది.

"అవునమ్మా! అందరిని అప్పులనే అనుకున్నాను. కాని, అందరూ పచ్చి స్వార్థ పరులయ్యారు. తలా ఒక వంద, రెండొందలో అయితే ఇవ్వగలంగానీ, ఎల్లకాలం ఎవరు పోషిస్తారన్నారు? కొసకు సిగ్గువిడిచి గోమతి పెళ్ళయినా అందరూ కలిసి చెయ్యమని అడిగాను. అందరూ తప్పుకున్నారమ్మా." అప్పుడప్పుడే ఆరుతున్న కళ్ళలో మరలా తడి.

"అమ్మా!" ఆపింది గోమతి. ఎగసిపడుతున్న ఎదను అదుపులో పెట్టుకుంటూ మళ్ళీ అంది. "ప్రయోజనం లేని మాటలతో ఆమెను విసిగిస్తున్నావు నువ్వు. మన జీవితాలు గడిచేది చూసుకోవాలి గానీ...."

'చంద్రా!' అని నోరారా పిలిచే గోమతి ఇంతవరకు మూగగా వున్నందుకు నేను బాధపడ్డాను. కానీ, ఆమె నోరువిప్పి మాట్లాడిన ఈ ఒక్కమాట చాలు... ఆమె మౌనానికి అర్థం చెప్పడానికి.... నా హృదయంనిండా గోమతి చోటుచేసుకోసాగింది.

కొన్ని సంవత్సరాల క్రితం గోమతి ఇంట్లో అద్దాల బీరువాలో బొమ్మలన్నీ మాయ మయి తన బీరువాలోకి వస్తే బాగుణ్ణనే పైశాచికమూ, అసూయాపూర్వకమూ అయిన కోరిక కలిగింది. ఈనాడు ఆ బొమ్మలు మాయమై తనింటికి రాకపోయినా, ఆ పిల్ల ఆ బొమ్మలు పోగొట్టుకుంది. ఈనాడు తను బొమ్మలు సంపాదించుకున్నాడు.

'పోనీ తీసుకోలే, చంద్రా' అని తన ప్రియమైన బొమ్మను త్యాగం చేయబోయిన ఆనాటి గోమతికి ఈనాడు తనేమీ చేయలేడా? గోమతికి తనేమైనా చేయాలంటే అసలు వాళ్ళ కథ తెలియాలి. వాళ్ళు ఆస్తి ఎందుకు పోగొట్టుకున్నారో అర్థం కావాలి. ఇంతవరకు ప్రేక్షకుడుగా శ్రోతగా వుండిపోయిన తను అక్కడినుండి నడిచి గోమతి అమ్మ ప్రక్కగా వెళ్ళి కూర్చున్నాడు.

"మీరు బాధపడకపోతే అసలు పొలం ఎలా పోయిందో తెలుసుకోవాలని వుందమ్మా."

ఆమె ఇక ఏదీ దాచుకోతలచుకోనట్టుంది. వెంటనే చెప్పింది. "ల్యాండ్‌సీలింగ్ అట కద, నాయనా.... అదే మా కొంప ముంచింది."

నేను నివ్వెరపోయాను. అంతవరకు ఆ ఊహ రానేలేదు.

గబగబ ఆలోచించాను. విజయ, గోమతి ఎదిగిన ఆడపిల్లలు. వాళ్ళకు ఆస్తిలో వాటా లేదు. తరుణ్, మధు ఇంకా మైనారిటీ తీరని పసిపిల్లలు. అందుకే వాళ్ళకు ఆస్తిలో హక్కులేదు. కానీ, మినిమమ్ కృష్ణారెడ్డికైనా ఇరవై రెండు ఎకరాలు మిగలాలి. అదేమయింది! అదే ప్రశ్న అడిగాను నేను.

"ఇల్లు అమ్మినప్పుడు మరో రెండు లక్షలు అప్పుచేసి పొలం కొన్నారు నాయనా. ఆ రెండు లక్షలు తీరే వుపాయం కన్పించలేదు. ఎక్కడ డబ్బూ పొలం మీద ఖర్చులకే సరిపోయేది. కూలీలకు అంతా కలిపితే ముప్పాతిక ఖర్చులకు పోను, పాతికే మిగిలేది. అందుకే పాతిక ఎకరాలు అమ్మేసి అప్పు కట్టేశారు. కానీ, అదేదో రూలట. ఆ చట్టం అమలు జరిపిన తర్వాత అమ్మిన పొలం లెక్కలోకి గాదటగా. నాకేం తెలుస్తాయి అవన్నీ, అందుకే మేము అబద్ధపు రిజిస్ట్రేషన్ చేశామని మిగిలినదంతా తీసేసుకున్నారు."

ఆమె మొదలెట్టినప్పుడే నాకంతా అర్థమయిపోయింది.

ఈ గవర్నమెంటు భూపరిమితి చట్టాల అమలు తాలూకు ఆశయం గొప్పదే కానీ, దాని తాలూకు గుడ్డి ఆచరణ చాలామందిమీద దెబ్బతీసింది. ఎదిగిన కూతుళ్ళకు ఆస్తిలో భాగం ఎందుకుండకూడదు? వాళ్ళకు మాత్రం ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం లేదా? మైనర్‌గా వున్న కొడుకులు మేజర్లు కారా? పోనీ పుట్టని బిడ్డలను పుట్టకుండా ఆపుకోవచ్చు. పుట్టిన బిడ్డలను ఏం చేయాలి? వాళ్ళ భవిష్యత్తును ఆపాలా? పొలాలు వుండీ అప్పులున్నవాళ్ళ సంగతేమిటి? పొలాలతోపాటు లక్షలతో బిజినెస్ చేస్తున్న వాళ్ళ మాటేమిటి?... నా మెదడులో ఇన్ని సంఘర్షణలు.

నేను తేరుకోకముందే మా అన్నకొడుకు పరుగెత్తుకొంటూ వచ్చాడు.

"బాబాయ్, వరకట్న నిషేధం గురించి రేపు మా స్కూల్లో ఉపన్యాసం ఇవ్వాలి. కాస్త చెప్పవూ?" అలా సుడిగాలిలా వచ్చినవాడు క్రొత్తవాళ్ళను చూసి చప్పున సిగ్గుపడి నా రూములోకి పరుగెత్తాడు. గోమతి అమ్మకు ఏం పరిష్కారం చూపించాలో బోధపడని నేను నిశ్శబ్దంగా వాణ్ణనుసరించాను.

కొన్ని సంవత్సరాల క్రితం నా బాల్యంలోనూ నేనిదే కట్నాల నిషేధం గురించి ఉపన్యసించాను. మరలా అన్న కొడుకు ఉపన్యసించబోతున్నాడు. రేపు మన మనుమడు... ఎల్లుండి వాడి కొడుకు. కానీ ఈ వ్యవస్థ మారడంలేదు. మారని ఈ వ్యవస్థను పట్టుకుని వేలాడేకంటే స్త్రీకి కూడా కొంత ఆర్థిక స్వాతంత్ర్యమిచ్చి, ఆస్తిలో హక్కు కల్పిస్తే స్త్రీ ఇంత ఆటబొమ్మగా ఆనాడు చూడబడదేమో!

నేను ఆలోచనలనుంచి తేరుకోకముందే నా ప్రక్కన పడిన నీడకు, చటుక్కున తలెత్తి చూసాను... నా ప్రక్కన గోమతి, కొన్ని సంవత్సరాల నా మధుర స్మృతి. ఏదో చెప్పాలనే ప్రయత్నంలో సంకోచంగా నావైపు చూస్తోంది. నేను తేరుకున్నాను. ధైర్యం తెచ్చుకున్నాను. మెల్లిగా అన్నాను.

"మీ నాన్నగారు పోవడం.... మీ దురదృష్టానికి... సారీ, గోమతీ" నా వాక్య నిర్మాణం నాకే అసహ్యమనిపించింది.

"ఒకరకంగా మేము అదృష్టవంతులమే! మా అమ్మ మాకింకా మిగిలింది." ఆమె కంఠంలో ఏ మాత్రం తొట్రుపాటు లేదు. కానీ, కళ్ళ కొసన చెదిరిన పాదరసంలా నీటి బిందువులు "వెళ్ళొస్తాను" ఆమె చేతులు జోడించింది.

వాకిటి బయట గోమతి తల్లి గొంతు కాస్త పలచగా విన్పిస్తోంది.

"డాక్టర్‌గారి దగ్గరికి మా బంధువులెంతోమంది బహుశః వస్తూ వుండచ్చు. మేమింత హీనస్థితిలో వున్నట్టు వాళ్ళకు తెలియడం నాకిష్టం లేదు. మేమిక్కడకు ఈ పనిమీద వచ్చినట్టు దయచేసి ఎవ్వరితో చెప్పకండి."

నేను గోమతితోపాటు గది దాటేసరికి ఆమె ముకుళిత హస్తాలు నా కంట పడ్డాయి.

గోమతి అమ్మకు నమస్కరించి వడిగా ముందు గది దాటేసింది. ఆమె వెళ్ళిపోతోంది.

నాకు గోమతి కావాలి. 'పోనీ తీసుకోలే. చంద్రా' అని తన ప్రియమైన బొమ్మను నా కివ్వబోయిన గోమతి నాకు కావాలి. నా స్మృతుల పేటికలో ఇంతవరకుర సజీవంగా నిలిచిపోయిన నా చిన్ననాటి స్నేహితురాలు సంపూర్ణంగా నాకు కావాలి.

సిరిలో పుట్టి, సిరిలో పెరిగి, ఈనాడు నా ముందు దైన్యంగా నిలుచున్న, నా ప్రియమైన గోమతి మరలా సిరిలోకి రావాలి.

'నేను గోమతిని పెళ్ళి చేసుకోవాలి.' ఈ మాట ఇప్పుడు తను అంటే అమ్మ నుదుటిమీద బొమ ముడిపడుతుందేమో! కానీ, గోమతి అమ్మగారి కళ్ళలో వెలుగు రేఖ జారిపడదూ....? గోమతి ముఖాన్ని విచారపుపొర వదిలిపోతూ!....

కానీ, తను గోమతిని పెళ్ళి చేసుకోగానే లక్ష్మీదేవమ్మ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా? విజయకు నాలాంటివాడే మరొకడు దొరుకుతాడని గ్యారంటీ కావాలి. మధు, తరుణ్ పెరిగిర పెద్దవాళ్ళయి ప్రయోజకులవుతారనే ధైర్యం కావాలి. వాళ్ళ ఆర్థికావసరాలు తీరే ఉపాయం కావాలి.

అందుకే ఆమె సమస్యలకు పరిష్కారం గోమతి పెళ్ళి ఒక్కటే కాదు. ఆమెకు జరగాల్సిన న్యాయం చట్టబద్ధంగా జరగాలి.

కానీ, ఎలా? ఎలా?

* * * * *

"ఇక లోపలకు రారా, చంద్రశేఖర్" అమ్మ పిలుపుకు తేరుకున్నాను. గోమతి గేటు దాటేస్తోంది.

ఆవేశం తాలూకు ఆలోచనలనుండి వాస్తవంలోకొచ్చాను.

'ఇప్పుడు తను చేయ్యాల్సిందేమిటి?'

గోమతి వెనగ్గా విశాలమైన మా గేటు తలుపులు మూసుకుంటున్నాయి.

నా మనసులో నిర్ణయం జరిగిపోయింది.

గోమతి తనదైనప్పుడు గోమతి కుటుంబ సభ్యులు తన వాళ్ళు కాదా?

వడివడిగా అడుగులు ముందుకేసాను.

"గోమతీ!" పిలిచాను.

గోమతి ఆగింది.